శ్రీధర్‌బాబుకు సన్మానం

చంపాపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): విదేశీ పర్యటనను దిగ్విజయంగా పూర్తిచేసుకొని ఇటీవల స్వదేశానికి తిరిగొచ్చిన ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును టీపీసీసీ అధికారప్రతినిధి వెదిరె యోగేశ్వర్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా యోగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి విదేశీ పర్యటనలో అనేక ముఖ్యమైన కంపనీలతో ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు, ఈ పర్యటనలో రూ.1,78,950 కోట్ల పెట్టుబడులను తెలంగాణ రాష్ట్రానికి రాబట్టడంతో 49,500 మందికి ఉద్యోగ భరోసాను సాధించినట్లు ఆయన అన్నారు.


మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి వెదిరె యోగేశ్వర్‌రెడ్డి



దావోస్ పర్యటనను విజయవంతంగా ముగించుకుని మంగళవారం నగరానికి వచ్చిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు స్వాగతం పలుకుతున్న హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ నేలపాటి రామరావు, తదితరులు - వనస్థలిపురం

హనుమాన్ ఆలయంలో ఎంపీ చామల పూజలు

చంపాపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని మహిమోన్నత పురాతనమైన హనుమాన్ దేవస్థానాన్ని మంగళవారం భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి దర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఎంపీని ఆలయ మాజీచైర్మన్ నల్ల రఘుమారెడ్డి ఘనస్వాగతం పలికారు. ఆలయంలోని వరసిద్ధ వినాయకస్వామి, ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో ఎంపీ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ వేదపండితులు, అర్చకులు ఎంపీకి వేదాశీర్వచనం అందించారు. ఆలయ ఈవో ఎస్.లావణ్య ఎంపీకి స్వామి ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ డివిజన్ పార్టీ అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, గూడూరు గౌతంరెడ్డి, తోకటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీ సౌమ్యమిశ్రా

జైళ్లశాఖ సంస్కరణలు భేష్

సైదాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ జైళ్లశాఖ ఖైదీల సంక్షేమానికి చేపడుతున్న సంస్కరణలు భేషుగ్గా ఉన్నాయని ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. మంగళవారం చంచల్‌గూడలో సీకా కార్యాలయ హాల్‌లో రెండురోజుల పాటు నిర్వహించనున్న తెలంగాణ జైళ్ల శాఖ రిట్రీట్-2024 జైళ్ల శాఖ డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రాతో కలిసి ప్రారంభించారు. ఖైదీల పరివర్తన, ఉపాధి, జైళ్లశాఖ సంపద సృష్టి అభినందనీయమని కొనియాడారు. డీజీ డాక్టర్ సౌమ్యమిశ్రా మాట్లాడుతూ ఖైదీల అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జైళ్లను ఆధునికీకరించనున్నామని అన్నారు. కార్యక్రమంలో ఐజీలు వై.రాజేష్, మురళీబాబు, డీఐజీలు డాక్టర్ శ్రీనివాస్, సంపత్, జైలు సూపరింటెండెంట్లు, డిప్యూటీ సూపరింటెండెంట్లు, అధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్‌లో జైళ్లశాఖ మరింతగా చేపట్టాల్సిన అంశాలపై చర్చించారు.

'ఆరోగ్యం కోసం జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి'

చంపాపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించడంతో పాటు అందుబాటులో ఉన్న ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి కోరారు. చంపాపేట డివిజన్‌లోని రాజిరెడ్డినగర్‌కాలనీ పార్కులో జీహెచ్ఎంసీ నిధులు రూ.9.50లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను మంగళవారం కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో రాజిరెడ్డినగర్ కాలనీ అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు క్రాంతికుమార్, కాలనీ ప్రతినిధులు జైహింద్‌రావు, రాజ్‌గోపాల్, శశి, బిహారీప్రసాద్, శర్మ, శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డి, సుభాష్‌రెడ్డి, నాయకులు అంజి, శివ పాల్గొన్నారు.

డ్రైనేజీ, మంచినీటి సమస్యలు పరిష్కరించండి

సైదాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న మంచినీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని మంగళవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవిందర్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. కొన్ని పైప్‌లైన్ల పనులకు టెండర్లు పూర్తయిన పనులు ప్రారం భం కాలేదని పేర్కొన్నారు. ఇందుకు ఎండీ స్పందించి అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు.

భద్రత నియమాలు పాటించండి

మన్సూరాబాద్, జనవరి 28 (ఆంధ్ర జ్యోతి): భద్రతా నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలను దూరం చెయాలని నాగోల్ ఇన్‌స్పెక్టర్ సూర్యానాయక్ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నాగోల్ చౌరస్తాలోని ఆటోస్టాండ్ వద్ద డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు రమేష్, శ్రీనివాస్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్ అవగాహన పోటీలు

కొత్తపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల్లో అవగాహనకు పోటీలు నిర్వహిస్తున్నామని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. మంగళవారం ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్సులోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ ట్రెయినింగ్ పార్కు లెక్చర్ హాల్‌లో పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రత అంశాలపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌లేన్స్, సైన్‌బోర్డులు, హెల్మెట్, సీటుబెల్టు ఉపయోగం, రోడ్ మార్కింగ్స్‌పై రంగుల బొమ్మలు వేశారు. విద్యార్థులకు వివిధ ట్రాఫిక్ నిబంధనల అంశాల్లో వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు వచ్చే నెల 14 వరకు కొనసాగుతాయని ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న గుర్తు తెలియని వ్యక్తి మృతి

చాదర్‌ఘాట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రెండునెలలుగా అపస్మారకస్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తి సోమవారం రాత్రి మృతి చెందాడు. చాదర్‌ఘాట్ ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. చాదర్‌ఘాట్ పీఎస్ కానిస్టేబుల్ ఎ.పవన్ కల్యాణ్ గత నవంబరు 24న పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాడు. మలకపేట మెట్రోస్టేషన్ సమీపంలోని సవేరాహోటల్ పక్కన గుర్తుతెలియని వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇచ్చారు. ఈమేరకు కానిస్టేబుల్ వ్యక్తిని చికిత్స కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు చాదర్‌ఘాట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబీకుల చెంతకు తప్పిపోయిన మహిళ

చాదర్‌ఘాట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన మహిళను చాదర్‌ఘాట్ పోలీసులు గుర్తించి మంగళవారం కుటుంబీకులకు అప్పగించారు. చాదర్‌ఘాట్ ఎస్ఐ భరత్ తెలిపిన వివరాల ప్రకారం.. రాణిబాగ్ నివాసి మెహర్ ఉన్నీసా(46) ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లి, తిరిగిరాలేదు. దీంతో ఆమె భర్త మహ్మద్ ఫరీద్ చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్ లో ఈనెల 26న ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు మెహర్ ఉన్నీసా మంగళవారం ఉదయం నాంపల్లి దర్గా వద్ద సంచరిస్తున్నట్లుగా గుర్తించారు. అనంతరం ఆమెను చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సిలింగ్ ఇచ్చి కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

దారంతా.. నిర్లక్ష్యమే!

విజయవాడ జాతీయ రహదారి విస్తరణ నిండా సమస్యలే

- చింతల్‌కుంట నుంచి హయత్‌నగర్ వరకు నిత్య నరకం
- ఇష్టం ఉన్నచోట సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులు...?
- సగం.. సగం పూర్తైన సర్వీస్ రోడ్లు.. పలు చోట్ల ప్రమాదాలకు అడ్డాలు

అధికారుల అలసత్వం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మూలంగా విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు సంవత్సరాల తరబడి కొనసాగుతూనే ఉన్నాయి. వెరసి హయత్‌నగర్ మొదలుకుని వనస్థలిపురం, చింతల్‌కుంట వరకు సంవత్సరాల తరబడి ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోక తప్పడం లేదు. నిర్మాణ పనులు క్రమపద్ధతిలో కాకుండా ఇష్టం ఉన్నచోట చేస్తుండడం, కొన్నిచోట్ల రోడ్లు తవ్వి వదిలేయడం, మరి కొన్ని చోట్ల కల్వర్టులు పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేయడం, వరదనీటి కాలువ పనులు పూర్తి చేయక పోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.


సుష్మా చౌరస్తా వద్ద వరద నీటి కాలువలో నిలిచిన మురుగునీరు

వనస్థలిపురం/హయత్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్‌కు వెళ్లేమార్గంలో మన్సూరాబాద్ వైపునకు వెళ్లేరోడ్డు నుంచి ఆటోనగర్ వరకు వరద నీటి కాలువ నిర్మించారు. అంతవరకు బాగానే ఉంది. నిర్మించిన వరద నీటికాలువలో మురుగునీరు చేరడంతో సుష్మాచౌరస్తా బస్‌స్టాప్ వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దుర్వాసన వస్తోంది. దీంతో ప్రయాణికులు, సమీప కాలనీల ప్రజలు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా అధికారులు అక్కడి వరద నీటి కాలువ పనులపైన దృష్టి సారించక పోవడం విడ్డూరంగా ఉంది.


వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ కమాన్ ముందర హైవే ప్రధాన రహదారిపై ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయని అధికారులు, కాంట్రాక్టర్

నత్త నడకగా సర్వీస్ రోడ్లు

విజయవాడ జాతీయ రహదారి చింతల్‌కుంట మొదలుకుని హయత్‌నగర్ రేడియోస్టేషన్ వరకు కాంట్రాక్టర్ ప్రధాన రహదారిని పూర్తిచేశారు. వాటికి గ్రిల్ కూడా ఏర్పాటు చేశారు. సర్వీస్ రోడ్ల నిర్మాణంలో మాత్రం తీవ్రజాప్యం ప్రదర్శిస్తున్నారు. హైకోర్టుకాలనీ నుంచి సుష్మా థియేటర్ వరకు జాతీయ రహదారికి రెండు వైపులా సర్వీస్ రోడ్డును తవ్వి వదిలేశారు. రోడ్డును మాత్రం నిర్మించలేదు. దీంతో వాహనదారులకు తీవ్రఇబ్బంది కలుగుతోంది. కొందరు వాహనదారులు అందులో నుంచి వెళ్లడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. విపరీతంగా దుమ్మురేగుతోంది. స్థానికంగా తీవ్ర దుమ్ము కాలుష్యం ఏర్పడుతోంది. రోడ్డును నిర్మించడానికి ఎలాంటి అవరోధాలు లేనప్పటికీ కాంట్రాక్టర్ ప్రయాణికుల పాట్లు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వదిలివేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వనస్థలిపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు సర్వీస్ రోడ్డును నిర్మించక పోవడంతో రోడ్డుపైన వేలాది వాహనాలను నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వనస్థలిపురం ప్రశాంత్‌నగర్ కమాన్ వద్ద హైవేరోడ్డుకు సమానంగా వరద నీటి కాలువను నిర్మించారు. రోడ్డును ఆనుకుని ఎలాంటి ప్రమాద హెచ్చరిక బోర్డునూ ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యంగా వదిలేశారు. దీంతో రాత్రివేళలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అదే విధంగా చింతల్‌కుంట రాఘవేంద్ర హోటల్ సమీపంలో ఇరువైపులా సర్వీస్ రోడ్డును పూర్తిచేసి మధ్యలో సుమారు 30 మీటర్ల దూరాన్ని రోడ్డు చేయకుండా వదిలేశారు. ఇది ప్రమాదకరంగా మారింది. రాత్రిపూట వాహనదారులు తెలియక అదే వేగంతో వచ్చి ప్రమాదాలకు గురవుతున్నారు. హరిణివనస్థలి ముందు వరకు సర్వీస్ రోడ్డు పూర్తిచేసి అక్కడ వదిలేశారు. అక్కడ నిర్మాణంలో ఉన్న కల్వర్టు పనులు ప్రమాదబరితంగా మారాయి. సర్వీస్ రోడ్లు పూర్తికాకపోవడంతో చింతల్‌కుంట మొదలుకుని హయత్‌నగర్ రేడియోస్టేషన్ వరకు ట్రాఫిక్‌చిక్కులు తప్పడం లేదు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు వాహనదారుల ఇబ్బందులు వర్ణణాతీతంగా మారాయి.


వనస్థలిపురం సుష్మా సాయినగర్ కమాన్ వద్ద అర్ధాంతరంగా నిలిచిపోయిన సర్వీస్ రోడ్డు, వరద నీటి కాలువ పనులు

సర్వీస్ రోడ్ల పనుల్లో వేగం పెంచాలి

ప్రజలు, వాహనదారుల ఇబ్బందులను, ట్రాఫిక్ చిక్కులను దృష్టిలో పెట్టుకుని కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులు సమన్వయంతో హైవే విస్తరణ పనులను చేయాలి. సర్వీస్ రోడ్డు పనులను త్వరగా పూర్తిచేయాలి. రాంగ్‌రూట్ పేరుతో ట్రాఫిక్ పోలీసులు వేస్తున్న చలానాలను ఆపివేయాలి. నిర్మాణ పనులు పూర్తయ్యే వరకు ట్రాఫిక్‌పోలీసులు చలానాలను విధించకూడదు. సుష్మా ముందర అపరిశుభ్రంగా మారిన పరిసరాలను శుభ్రం చేయించాలి


- నకిరేకంటి వెంకటేష్ (వనస్థలిపురం)

తెలంగాణ తొలి దశ ఉద్యమకారులకు అన్యాయం

1969 ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు రామరాజు

మన్సూరాబాద్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): 1969 నాటి ఉద్యమ స్ఫూర్తితోనే మలిదశ ఉద్యమం కొనసాగిందని, ఉద్యమ స్ఫూర్తితో వచ్చిన తెలంగాణలో ఉద్యమకారులకే తీవ్ర అన్యాయం జరగడం బాధాకరమని 1969 తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు పేర్కొన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన మలిదశ ఉద్యమకారులతో మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఇందిరానగర్‌లో మంగళవారం సంఘం రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు చేసి 1969 నాటి ఉద్యమకారుల సమస్యలను పలు రకాలుగా ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తానే ఉన్నామని, కానీ ఏ ఒక్క ప్రభుత్వం మేనిఫెస్టోలో తప్ప తమ గోడును పట్టించుకోవడం లేదన్నారు. 1969 నాటి ఎంతో మంది ఉద్యమకారుల్లో ప్రస్తుతం సుమారు 4వేల మంది మాత్రమే సజీవంగా ఉన్నారన్నారు. ప్రత్యేక కమిటీ ద్వారా వారికి గుర్తింపు కార్డులు జారీచేయాలని కోరారు. అదేవిధంగా గౌరవప్రదమైన రూ.10వేల నుంచి రూ.15వేల పెన్షన్ , 250 చదరపు గజాల ఇంటి స్థలం, ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉన్న తమకు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం, ఉచిత రవాణా సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చే శారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల మలిదశ ఉద్యమకారులు వనం చంద్రమౌళి, యేళ్ల చంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే డి.సుదర్శన్ రావు, కె.సీతారాంరెడ్డి, కె.విశ్వేశ్వర్‌రావు, బొమ్మడి లక్ష్మీనారాయణ, ఎన్.భాస్కర్‌శర్మ, కూతురు కృష్ణమూర్తి, ముత్తినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు రామరాజు

అచ్చంపేట మార్కెట్ ఉద్యోగులపై దాడికి నిరసన

ఓల్డ్‌మలక్‌పేట జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం చైర్మన్, ఉద్యోగులపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో చైర్‌పర్సన్ చెకొలేకర్ లక్ష్మి, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి మార్కెట్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. చైర్మన్, ఉద్యోగులపై దాడిచేయడం హేయమైన చర్య అని ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్, టీపీసీసీ ప్రధానకార్యదర్శి చెకొలేకర్ శ్రీనివాస్, మార్కెట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో 2,243 కొత్త రేషన్‌కార్డులు

ఓల్డ్‌మలక్‌పేట జనవరి 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం అర్హులైన వారికి కొత్తరేషన్‌కార్డులు జారీ చేసేందుకు చేపట్టిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయింది. అర్హుల జాబితా సిద్ధం చేశారు. త్వరలోనే వార్డుకార్యాలయాల్లో ప్రదర్శించనున్నారు. మలక్‌పేట నియోజకవర్గంలోని ఏడు డివిజన్ల పరిధుల్లో మొత్తం 2,977 కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయి. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇటీవల చేపట్టిన రేషన్‌కార్డుల సర్వేలో దరఖాస్తులు పరిశీలించిన అనంతరం 2,243 కొత్తరేషన్ కార్డులకు అర్హులుగా గుర్తించారు. అర్హుల జాబితాను సివిల్‌సప్లై అధికారులకు పంపించారు. ఫిబ్రవరి మొదటి వారంలో వార్డుకార్యాలయాల్లో కొత్తరేషన్ కార్డుల లిస్టు ప్రదర్శిస్తామని సర్కిల్-6 డీసీ జయంత్ తెలిపారు. ఫిబ్రవరి మొదటివారంలో వార్డు సభల ద్వారా కొత్తగా దరఖాస్తులకు అవకాశం ఉంటుందంటున్నారు.

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా బోధనలు

చాదర్‌ఘాట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): అభ్యర్థులకు ఉత్తమ విద్యను అందిస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేలా బోధనలు చేస్తున్న చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోలీస్ నిర్వాహకుల కృషి ప్రశంసనీయమని గ్రూప్-2 అధికారి జేఏవో పి.చైతన్య అన్నారు. మంగళవారం దిల్‌సుఖ్‌నగర్‌లోని చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోలీసు వార్షికోత్సవంలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారితో, డైరెక్టర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన మూడేళ్లలో గ్రూప్-2, గ్రూప్-4, ఎస్ఐ, కానిస్టేబుల్స్‌గా ఎంతో మంది ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే మాక్ టెస్ట్‌లో అత్యున్నత ప్రతిభ కనబరచిన అభ్యర్థులకు జ్ఞాపికలను అందజేశారు.

కేన్సర్ నిర్ధారణ క్యాంపు

హయత్‌నగర్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడ నీలం సంజీవరెడ్డినగర్ కాలనీ బస్తీ దవాఖాన వద్ద రాగన్నగూడ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం సియాన్ కేన్సర్ క్లినిక్ ఆధ్వర్యంలో ఉచిత కేన్సర్ నిర్ధారణ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాగన్నగూడ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సామ భీంరెడ్డి హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మర్రి అంజిరెడ్డి, మాజీ సర్పంచ్ పూజారి శంకరయ్యగౌడ్, క్లబ్ నాయకులు మర్రి మహేందర్‌రెడ్డి, జూపల్లి వెంకటేశ్వరరావు, గుత్త మహేందర్‌రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి, యాదగిరి, కుంట గోపాల్‌రెడ్డి, ఎలిమినేటి వెంకట్‌రెడ్డి, దాసరి సుధాకర్‌రెడ్డి, డాక్టర్ లావణ్య, సుజాత, మహిళా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

వనస్థలిపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా అధికారులు చర్యలు చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం నర్సింహరావు నగర్ కాలనీలో కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పాదయాత్ర చేసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

వ్యాఖ్యలను బండి సంజయ్ వెనక్కి తీసుకోవాలి

వనస్థలిపురం, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ, గద్దర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ తన మాటలను వెనక్కి తీసుకోవాలని ఎల్బీనగర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్‌రెడ్డి పిలుపుమేరకు మంగళవారం శివకుమార్ ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ హైవేపై ఇందిరాగాంధీ, గద్దర్‌పైఅనుచిత వ్యాఖ్యలు చేసిన బండి సంజయ్‌కుమార్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ బండి సంజయ్ తక్షణమే క్షమాపణలు చెప్పాలన్నారు. లేనిచో యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ఎస్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యారెడ్డి, హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సాయినికేష్, సాయిరాంరెడ్డి, సామలేటి సాయి, రుత్విక్, రాముయాదవ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి

హయత్‌నగర్, జనవరి 28 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తుందని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్‌లోని బొమ్మిడి నాగిరెడ్డి గార్డెన్‌లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహాసభలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్‌రెడ్డి రాంరెడ్డి సీనియర్ నాయకుడు ముద్దగోని రాంమోహన్‌గౌడ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి రావడానికి ఆర్టీసీ ఉద్యోగులు చేసిన సహాయం మరువలేనిదని అన్నారు. ఆర్టీసీ కార్మికులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడానికి సిద్ధంగా ఉందన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎంఏ రహమాన్, ప్రధాన కార్యదర్శి బీవీ. కోటయ్య పాల్గొన్నారు.


రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డిని సన్మానిస్తున్న ఆటోడ్రైవర్లు

ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు

చాదర్‌ఘాట్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): బీఎన్ రెడ్డినగర్, ఎల్బీనగర్ నుంచి ఐఎస్‌సదన్ వరకు ప్రయాణికులతో రాకపోకలు సాగించే ఆటోడ్రైవర్ల సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర రోడ్డు అభివృద్ధి సంస్థ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి తెలిపారు. మంగళవారం దాదాపు 300 మంది ఆటో డ్రైవర్లు చైతన్యపురిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ ట్రాఫిక్ పోలీసు అధికారులతో చర్చించి ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు సంతోష్‌యాదవ్, శ్రీకాంత్ , కాటం, చాన్‌పాషా, ఆజీమ్, మహేందర్, నర్సింహ, లింగం తదితరులు పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్

- దాదాపు 80 మంది విద్యార్థులకు అస్వస్థత

సరూర్‌నగర్, జనవరి 28(ఆంధ్రజ్యోతి): బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌లోని కందుకూరు సోషల్‌వెల్ఫేర్ హాస్టల్‌లో ఈ నెల 26న ఫుడ్ పాయిజన్ సంఘటన చోటు చేసుకుంది. దాదాపు 80 మంది విద్యార్థులు అస్వస్థతకు గురై వాంతులు, విరేచనాలు చేసుకున్నారు. కాగా హాస్టల్‌ప్రిన్సిపాల్‌తోపాటు ఇతర సిబ్బంది ఈ విషయం బయటకు పొక్కకుండా దాచిపెట్టడంతో మంగళవారం వెలుగులోకి వచ్చింది. కందుకూరుకు చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ నాదర్‌గుల్‌లో కొనసాగుతున్నాయి. ఇక్కడ 524 మంది విద్యార్థులు ఉంటున్నారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా హాస్టల్‌లో స్వీట్ బూందీ చేయించారు. అదేవిధంగా ఆదివారం కావడంతో ఎప్పటిలాగే విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పలు వంటకాలతో హాస్టల్‌కు వచ్చారు. జెండా వందనం ముగిసిన తర్వాత స్వీట్ బూందీ.. ఆ తర్వాత హాస్టల్ భోజనంతో పాటు తల్లిదండ్రులు తెచ్చిన వంటకాలను సైతం విద్యార్థులు ఆరగించారు. అదేరోజు సాయంత్రం నుంచి సుమారు 80 మంది విద్యార్థులు కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలకు గురయ్యారు. హాస్టల్ ప్రిన్సిపాల్ దానమయ్య వారిని స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లి ట్రీట్‌మెంట్ చేయించారు. ఈ విషయం ఎవరికీ తెలియకుండా జాగ్రత పడ్డారు. అయితే మంగళవారం కొందరు విద్యార్థులు తమ తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో వారు హాస్టల్‌కు చేరుకుని ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. మళ్లీ తలెత్తకుండా చూసుకుంటానని ప్రిన్సిపాల్ సర్ది చెప్పారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ సురేందర్ యాదవ్

నాగోల్ డివిజన్ అభివృద్ధికి నిధులివ్వండి

మన్సూరాబాద్, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): నాగోల్ డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చెయ్యాలని కార్పొరేటర్ చింతల అరుణసురేందర్‌యాదవ్ అన్నారు. మంగళవారం నాగోల్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబరిదిని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాగోల్ డివిజన్ అధ్యక్షుడు పంగా శ్రీకాంత్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంకీర్తన అకాడమీ ఆఫ్ మ్యూజిక్ వార్షికోత్సవం

వనస్థలిపురం, జనవరి 28 (ఆంధ్ర జ్యోతి): విద్యార్థులు విద్యతో పాటే సంగీత కళలపై ఆసక్తిని పెంచుకుని రాణించాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్‌రెడ్డి అన్నారు. సంకీర్తనఅకాడమీ ఆఫ్ మ్యూజిక్ ఏడో వార్షికోత్సవాన్ని సంగీత గురువు ఎం.సత్యవతి, కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్‌లోని వాసవి కాలనీలోని వాసవి ఆధ్యాత్మిక కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చిలుక ఉపేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంగీత గురువులు నూకల జగదీశ్వరి, సోమయాజులు, నర్సింహరావు, కాలనీఅధ్యక్షులు మైసయ్య, సత్యనారాయణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలుగు పథకాల హామీ అమలు

చంపాపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నాలుగు పథకాలను అమలు చేస్తున్నట్లు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ అన్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి రూ.12వేలను అందిస్తున్న ఘనత ప్రజా ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతుభరోసా కింద రైతులకు ఎకరాకు ఆరు వేల చొప్పున వారి బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతున్నట్లు ఆయన తెలిపారు.

టీపీసీసీ ఇన్‌చార్జికి సన్మానం

చంపాపేట, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి విష్ణునాథ్‌ను మంగళవారం గాంధీభవన్‌లో చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానం పాలకమండలి మాజీ డైరెక్టర్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్ సన్మానించారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్, రాష్ట్ర కుమ్మర సంఘం ప్రధానకార్యదర్శి మాల్కాజిగిరి దయానంద్, మాలల ఐక్య వేదిక తెలంగాణ అధ్యక్షుడు బాలకిషన్, ఖిల్లామైసమ్మ దేవాలయం మాజీ చైర్మన్ కందికంటి శ్రీధర్‌గౌడ్, మాజీ ధర్మకర్త యాదగిరి పాల్గొన్నారు.